పెద్దకథ:

# ఎదురు తిరిగితే...

— అల్లం రాజయ్య

(కరీంనగర్ జిల్లా, మంథెన తాలూకా, గాజులపల్లి గ్రామంలోని ప్రజల భాష ఈ కథలో వాడబడింది.)

"దండమయ్య పటేలా" అంగి[1] దండం బెట్టిండు పోశమల్లు. ఆవెనుకనే తులు పిసుక్కుంట నిలబడ్డడు పోశమల్లు ఎనుక మాదిగగూడెం సిన్న, పెద్ద నిలబడ్డరు.

ఇంటిముంగటి గద్దెమీన కూకుండి పండ్లు తోముతున్న నరసయ్య తుపుక్కున ఊంచి మారు దండం బెట్టకుంటనె "ఏందో సెప్పుర్రా..." అన్నడు.

"నువ్వు సెప్పరాదుర పెదకొంరు..." కర్రెపోశడు దూరంగా కింద కూకుండుకుంట అన్నడు

మందిని జరుపుకుంట ముంగటి కచ్చిండు నంబర్ కొంరడు.

"పటేలా గదే[2] బాంచెన్, ఆనాడేదో బుద్ది గడ్డి తిన్నందుకు దొరోరు నీరటి బిచ్చం [3] ఎగబెట్టింరా? తోలాలిసి ఆఖరికి అమీన్ కచ్చీర్ల[4] పెట్టిన సంగతి మీకెరుకేనాయె... ఇయ్యేడు తొంటకొంరని కొడుకు లింగడు, తాస్నె దుగ్గికాడుకు కర్రెలింగడు కల్సి కన్‌రెడ్డి కుంటెనక నీరటి తనము జేసిర్రు కదుండీ! దొరోరు ఏడాది పొంటనీళ్ళు పెట్టిచ్చుకొని ఆఖరికత్తె[5] జీతమెగ బెట్టిర్రు..." కొంరడు గుక్కతిప్పుకున్నడు.

---

1. వంగి 1 A. ముందుకు 2. అదే 3. పొలానికి నీరుపెట్టినందుకు కూలీ 4. (అమీన్ కచ్చీర్ల) పోలీస్ స్టేషన్లో 5. చివరకువస్తే.

"ఆదెరికేనురా, దొరోరి[6] సంగతి ఎవ్వలకు తెల్వదని? దానికొరకేం జెయ్యల్నో సెప్పరా" పండ్లపుల్ల దూరంగా ఇసిరేసి నర్సయ్య బోడగుండు మీన్నుంచి తొంటసెయ్యిని పోనిచ్చి ఉండీ లేనట్టున్న జుట్టుపోసను దొరుక బట్టి దాన్ని దువ్వుకుంట అన్నడు.

"నువ్వాగుర కొంర...ఇగనే జెప్పత..." పోశమల్లు ముంగటికచ్చిండు[7].

"నర్సయ్య పటేలా! ఏటా కన్‌రెడ్డికుంటెనుక అయిదుగిద్దెలు పెట్టేసంగతి మీ కెరుకేనాయె. సిల్లర, మల్లర ఇద్దూమ త్తె,[8] మూడు గిద్దెలు కొత్తదొరయే నాయె, ఆయింత మూడు గిద్దెలు ఎగబెట్టి్రంటె కుంట బట్టినోని నోట్లె మన్నె గదా! ఈన్దికొద్దిగా మోరుదోపని, అదిగాక ఎనకటినుంచి ఈనయ్య కులపెద్ద గదా అని పెద్దజేత్తే ఓట్లప్పుడు కోమటి కిట్టయ్య పటేలు దగ్గర్నుంచి కచ్చెడు గడ్డి దెచ్చుకున్నడు. పోనియ్యి అని ఊకుంటె నాటి, నా్రతి లేసి దొరోరి దొయ్య[9] కట్టుకచ్చిండు. ఈడు సెయ్యవట్టి దొరోరు తొంటకొంరని కొడుకు లింగనికి, క్రరె లింగనికి ఏడాదంత నీళ్ళు పెట్టిచ్చుకొని నీరటిబిచ్చము ఎగపెట్టి్రరు, ........." పోశమల్లు కొంరని తప్పును ఎత్తి సూపిచ్చుకుంట సెప్పిండు.

మందిని జరుపుకుంట తొంట కొంరని కొడుకు లింగడు ముంగటి కచ్చిండు. ఆనెనుక ఆని అవ్వ[10] గట్టు మల్లి, నర్సయ్య ముంగటి కచ్చింది...... ఆళ్ళిద్దరు కాల్ల కాగి నేలమీన రెండు సేతులతో ముట్టుకొని మొక్కి్రరు.

"నీ కాల్ల కిందోల్లము బాంచెన్ నిలువుతా ముంచి్రరు నా కొడుకును" గట్టు మల్లి సక్కగ నిలబడి అన్నది.

"దెహేఁ నువ్వట్లాగరాయె..." లింగడు కసిరిండు.

"నువ్వట్లుండరాదు రా బాంచ కొడుక, పటేలుకు కట్టసుకము సెప్పుకుంటాంటె నీకెందుకురా? గిట్లసేసే ఇల్లు ముంచినవ్... ఏడాది పొదుగుత కట్టబడి

---

6. దొరవారి 7. వచ్చి నాడు 8 రెండు తూములువస్తె (తెలంగాణలో ధాన్యం కొలత) 9. దొయ్య పొలం (?) 10 అమ్మ.

పోరగండ్లను కూడులేకుంట సంపుతంటవి. మాదండి 'మొగోడచ్చిండు మంచ మెల్లులుక [11] లేయి అన్నదట' నీకెప్పుడు ఉరుకు లాటె..." సేతులు ఆరుసుకుంట లింగన్ని కసిరింది...

లింగడు ముఖం మాడుసుకున్నడు.

"ఊకోయె [12] గట్టు మల్లి... ఆఁ... ఏందిర లింగ...?" కిందికి మీదికి నాలుగుసార్లు గురుకపెట్టి [13] తుపుక్కున ఊంచిండు.

"మీకు సెప్పెటోన్న బాంచెన్. కొంరడు సెయ్యవట్టయితేంది ? దొరోరు సెయ్య వట్టయితేంది? నా పోరగాండ్ల కడుపుల మీన కొడుతాౘ్రరు. పిల్లలు గల్లోన్ని బాంచెన్, ఆరుగాలము [14] కట్టబడ్డను బాంచెన్ నాకచ్చే ఇత్తులి [15] ప్పియ్యౘ్రరి బాంచెన్..." నర్సయ్య ముఖంలకు దీనంగ సూసుకుంట అన్నడు లింగడు.

"మీరంత ఏమంటౘ్రరా..." నర్సయ్య మాదిగోళ్ళ కెల్లి సూసిండు.

"పెద్ద మనుసుల్ని కుప్ప జెయ్యిమన్నమ్. పెద్దలోకులు ఇసారించి తప్పు నిర్నాయము జేయ్యౘ్రరి బాంచెన్" గడిపెల్లి జక్కడు గుతుప కట్టెను నిలవొడిసి దానిమీద గద్దువ [16] ఆన్చుకొని నిలబడి అన్నడు...

"అయితే పోశాలుకు, కిట్టయ్యకు సెప్పిరాౘ్రి ... " నర్సయ్య లేచి నిలబడు కుంట అన్నడు.

"తవఁరికే ముందుగాలు సెప్పాలని అచ్చినం ... బాంచెన్ ..." తొస్సె దుర్గి కొడుకు కౘ్రరె లింగడు అన్నడు.

"సరె సెప్పు ర గని [17] నాకియ్యల్ల తీ ర్తదో ? తీరదో ? పెద్దకొడుకు నూర్లకు నూర్లు, ఇమ్మడికి ముమ్మడి ఎదురుబియ్యం బత్తాలు [18] కొంచబొయ్యి పట్నంలో

---

11. వెల్లకిల 12. ఊరుకో 13. కాంౘ్రడించి 14. ఎల్లకాలము
15. గింజలు (విత్తనాలు) 16 గడ్డం 17. కాని 18 బస్తాలు

480

సదువుతున్నడాయె ... సిన్నకొడుకులిద్దరు ఇంకోకాడ సదువుతున్నరాయె ... పాలేర్లున్నరు, ఒకడు తాళ్ళల్ల[19] పంటె ఇంకోడు ఈదులల్ల[20] పంటడు. నేను సేతకెల్లి[21] బోంది ఎల్లదాయె, సడుగు[22] గుత్తబడితె ఎవ్వాళ్ళు అటు మొఖాన అచ్చిన పాపానపోరు ... సుప్పరబేగ్ అత్తె నర్సయ్యేడి అని నన్నే అడిగె - టేపేసి కొలుత్తే లెక్కలు సేసుకుంట ఎంటబోవన్నాయె ... నాకెక్కడి తీరిక ... అయిన అత్తననుకో. ఇయ్యల్ల కలువడిగని[23] రేపు సూత్తాము ... పోశాలును, కిట్టయ్యను, దొరోరిని ఉండుమన్నరి. రేపు అంబటాల్లకు[24] భూలచ్చిమికాడ మీ పంచాతి తెంపుదాం ...'' కాంద్రకిచ్చి ఊంచి ఇంట్లకు నడిసిండు నర్సయ్య ...

"బాంచెన్ రేపొల్లంత ఉంటర ? దొరోరుగుడుక[25] ఇంటికాన్నే ఉన్నరట,... పోశాలు పటేల్, కిట్టయ్య పటేల్ గుడుక ఉన్నరట బాంచెన్...తమరుగుడుక ఉండక బోతే కాదు బాంచెన్..." కర్రె లింగడు పెద్దరువాజ[26] కాడ నిలబడి మొక్కిండు...

"కలువదంటలేనుర ... నేనేమొ ఖరాకండి మనిసిని. మాటా మరోటా ? నోరా తాటిమట్టా ?" కిర్రుసెప్పులు పందిరికింద ఇడిసి "నీల్లావలికి బట్టే! ..." ఇంట్లకు కేకేసిండు...

లింగని కెటు దోసలే, అట్లనె నిలబడ్డడు ...

ఇంట్లనుంచి బయటికి వచ్చిన రామక్క "ఊకే[27] పంచాయితిలే పనా బట్టా...? అవతలోల్లు ఏ గంగల పోతేంది ? ... " ముఖం చిట్లించింది.

"నువ్వు ససరాదే[28] ... లింగా ! అయితే పగట్నించి సేద్దాము ... ఓ కయికిలోన్ని[29] బెట్టి మా గుట్టకింది పెరడికాడికి పొమ్మను" నర్సయ్య అసలు విషయం తేల్సిండు.

---

19. తాటిచెట్లు 20. ఈతచెట్లు 21. పనికి 22 కోడ్డు. 23. కుదరదుకాని 24. భోజనం వేళకు 25. కూడ 26. పెద్ద తలుపు 27. ఎప్పుడూ 28. ఆగరాదు? 29. కూలివాడ్ని.

లింగని మొఖము మాడి పోయింది. ఇంట్ల తినేందుకు ఇత్తులు లేంది కయికి లెట్ల పెట్టగలుగుతడు పాపం ...అయినా ఆశ...దొరోరిచ్చే అడ్ల[30] మీన ఆశ... అప్పో, సప్పో సెయ్యాలనుకుని నర్సయ్య దొడ్డ బుద్దికి మొక్కి ఎనుకకు తిరిగిండు

"ఏందిరో లింగ! ఇయ్యాల్ల అందరి కయికిల్లు పోవాలంటవ? పొద్దుందనుక[31] ఎట్ల కలుత్తదిర ?..." అన్నరు మాదిగోళ్లు.

"ఎట్లర్రా గింత ఎట్లన్న జెయిర్రి..." లింగలిద్దరు బతిలాడిరు౨.

నంబరు కొరండు లేసి బుస బుస లాడుకుంట బూతులు తిట్టుకుంట ఎల్లి పోయిండు.

అడెనుక మాదిగోళ్ళంత కదిలిరు౨...

* * *

## 2

ఏపసెట్టు గద్దెమీన పోశాలు కూకుంది. మోకాళ్ళకు పంచెసుట్టుకొని సుట్ట తాగుతండు... అయినె పక్కకు నర్సయ్య సెట్టుకొరిగి కూకున్నడు– ఏప పుల్లను పండ్ల సందుల్ల పెట్టుకుంట. ఓగెలు గద్దె కింద దుబ్బల్ల కూకున్నరు.

సర్పంచ్ కిట్టయ్య గడెంచలో[32] కూకుండి బీడి పల్లసందుల్ల పెట్టుకొని పిడికిలి మలిసి తాగుతండు.

గద్దె కెడుమకెల్లి[33] దూరంగా మాదిగోల్లంత కూకున్నరు కుప్పగ మూల తిరుగుడుకాద మాదిగి ఆడోల్లు గుడిసె సూరుకింద మాసిన పేగులు కట్టుకొని నిల నిలబడ్డరు.

దూరంగ మాదిగోళ్ల పోరగండ్లు దుమ్ములో ఆడుతన్నరు.

"సుంకరి నర్సిమ్మడు జాడ పత్త లేకుంట పోయిండు. గాంధచ్చి సవరా

30. వడ్లు, 31. దినమంతా, 32. చిన్నమంచము,
33. ఎడమవైపు.

జ్జెమని బొత్తిగ భయం భీతి లేకుండ సేసిండు. లంజకొడుకులంత మాట ఇనకుంట అయిరు౨..." సుంకరోని కోసం బజార్లకు సూసుకుంట అన్నడు పోశాలు...

ఏపసెట్టుమీన కాకులు, గొ౹రెంకలు రొదపెడ్తున్నయి. ఏపచెట్టు ఆకులు రాలిసింది. కొమ్మల సందుగుండ సూరీడు తొంగి సూత్తాండు.

సుంకరి నర్సిమ్మడు కొశ్శెటి [34] బరిసె ఎడమసేత పట్టుకొని అందఃకి దండాలుసెప్పి నిలఖడ్డడు.

"లంజకొడుక ... ! గింతసేపేంజేసినవురా?" కిట్టయ్య బీడికొస దులిపు కుంట గదమాయించిండు.

"గట్లంటెట్ల [35] బాంచెన్. పొద్దిట్నుంచి నోట్లె మంచినీళ్ల పొయ్యకుంట తిరుగుతనే ఉంటి ... సేన్లకాడికి పోయినోల్లు, గుంటుకులకు [36] పోయినోల్ల - జను సేసెటందుకు గింతసేపు పట్టె ... ఆడికి బిందొర ఇంక తానము సేయలేద౹ని." సుంకరి నర్సిమ్మడు దూరంగ జరిగి జనుకుకుంట అన్నడు.

"నీ అంతుకు మేమే సుంకరితనము సేత్తముగని పల్లెమీని పెద్దొర దగ్గర కెల్లి జెప్పన [37] పిలుసుకురా ... " నర్సయ్య హుకుం జారీ చేసిండు.

నర్సిమ్మడు దొరోరి ఇంటికెల్లి ఉరికిండు ...

"దొరెచ్చేటల్లాకు మీ సంగతేందో సెప్ప౹రా మాదుగులు ... " పోశాలు.

"మీ కెరుకలేందా బాంచెన్?..." పి౹రలగట్టడు గునిసిండు.

"ఎరికేరా? నాకొక్కనికెరుకే? నాకొక్కని కెరుకుంటె మా౹తం! కాకుంటె ఈ మందిలో నర్సిమ్మని కెరుకుండచ్చు ... కాదురా నర్సిమ్మా?" నర్సయ్యతోని పోశాలు అన్నడు.

---

34. మొనదేలిన 35. అలాఅంటెఎలా 36. పొలం చదును పనికి
37 వెంటనే.

"అదికాదు పోశాలు ... " మజ్జెలో తుపుక్కున ఊంచి "మనకెరుకుంటె ఎరుకున్నది గని ఇక్కడ కూకున్న నలుగురు ఇనాలెగద ? నలుగురున్నకాడ నారాయుడున్నడు. అందరేమంటరో ? ... " మందికెల్లి సూసిండు నర్సయ్య.

"మీకంటె ఇక్కడ ఎవ్వల కెక్కువ తెలుత్తది ?" లసుమయ్య నడిమందిల నుంచి అన్నడు

నర్సయ్య నలుగురిజోలి తీసింది ఈ మాట కోసరమే.

"ఎట్లయిన మాదిగ లంజకొడుకులకు కావురమచ్చిందిగని, కండ్లునెత్తి మీని కెక్కినయ్ — మొన్నటికిమొన్న అయ్యగారి బాయికి నీళ్ళు సేదుకొంట మని గుజి కట్టుకొని అచ్చిన్రు. అవ్వల మిండల సొమ్మయినట్టు " ఓదెలు మాది గోల్ల మీని అక్కసంత ఎల్లగక్కిండు.

"బాంచెన్ గులా పోల్లము[38] ...ఇన్నేండ్లబట్టి మీ బాయికి నీల్ల కచ్చినమా ? బూరుగాగు [32] బొబ్బలు కొట్టినా—మంచినీళ్ళేక సచ్చినమ్‌గని; లడ్లు, మురుకులు గతికితిమి. మీకండ్ల ముంగట్నె బూరుగాగంత ఇయ్యేడు ఎండిపోయింది గద్సరి ...అనదేవుడు ముంచె...ఏడ సావుమంటరు ? బాంచెన్. సర్కార్ కట్టిచ్చి గిరుక[40] లేసిన్రని నీల్లకత్తిమి...ముందుగాల నీపెండ్లం పియిదింట-లసుమవ్వను సేదెదన్ని నీళ్ళుమొయ్య మంటెతంద్రి కయ్యకేర్గ[41] గులాపోల్లము మేమొ గిరుకకు సేదు కుంటమంటె-దుడ్లు తీస్కచ్చి ఈపులన్ని మెతిపితిరి. ఆకరికి అరి మడ్లల్ల[42] పొక్కదోడు కుంటిమి... నీ బాంచెన్ గసొంటి[43] కరువు కాలాలొత్తే ఏడ పొదుము." సమ్మడు తమదేమి తప్పుగాదని నచ్చసెప్ప సూసిండు.

"అదంటె పోనియ్యి—బొత్తకొంరని బలుపు మదము గాకేంది - ఆడే దొంగతనము జేత్తడు. ఎందుకు జేసినవ్‌రా?' అంటె "కడుపుగాలి" అంటడు. దొరోరు నీరటిబిచ్చం ఎగ బెట్టడా మరి ? కావురంకొద్ది అడ్లకచ్చులాల[44] కడ్డం బోయి కనాలూడబీకె[45] 'బిచ్చం బెట్టే దనుక కచ్చులాల కదులనియ్య'నంటడు...

---

౩౮. గులాములము ౩౯. బూరుగు అను వాగు 40. గిలక 41. తిట్టెను 42. వరిమళ్ళలో 43. అటువంటి 44. కచ్చురం (బండి) 45. ఎడ్లను కాడికిబిగించి వుంచే కర్రలు.

484

ఈడు లేసినేల్లమంచిది. దొరోరు ఏకాల్లి[46] లున్నరో కర్నెకోల కట్టందుకొని పిల్లిని పొడిసినట్టు పొడిసోసెటోరే- ఈపు మెతిపి ఇడిసిపెట్టిండ్రు- ఆడికి దొరే దమ్ము మింగిండు—తెల్లారి పంచాతుకు పిలుత్తే 'ఏదో బాంచెన్ ఇన్ని కల్‌సిల్లుదా గినంటడు'-గిన్ని సేసినంక ఇగమాదిగోళ్ళకు సీరటి బిచ్చం ఎట్లాపెడుతరు?" ఓదెలు తుపుక్కున ఊంచి "మాదిగ లంజకొడుకులు పాపమన వశమా?" అని తేల్చేసిండు.

మాలి పటేలు మాదవరెడ్డి బీడి కాల్చుకుంట అచ్చిండు.

మాదిగోల్లంత లేసి నిలుసుండి దండాలు ఫెట్టిరు9. గుంపులనుండి ఒకడురికి ఎవ్వలనో గడెంచడుకచ్చి దొరకేసిండు.

దొర గడెంచలో కూకున్నడు.

"ఇంక పెద్దొర రాలే... నర్సిమ్మ డేడబోయిండు..." బీడి మొక్కని ఇసిరేసి అన్నడు.

"ఆడికే తోలించన మర్రి" పోశాలు సదురుకొని కూకుండి అన్నడు..

"తొంట కొంరని కొడుకు లింగడు- కర్రె లింగడు అచ్చిన్రా?" మాదిగుల కెల్లి సూసుకుంట అన్నడు.

"అచ్చినమ్... బాంచెన్..." జెరముంగటికచ్చి కూకున్నరు.

"బొత్తకొంరదేడి!" దొర.

భూలచ్చిమి ఎనుక కూరుకుతున్న కొంరన్ని ప్రక్కకున్న పెద్దిగాడు లేపిండు... ఉలికిపడి "ఓయ్..." అన్నాడు అదురుదగ.

"బంచేత్... ఓ యేందిరా? బామ్మరిది నన్నట్టు! పెద్ద మనుసుల్ని పంచాతికి పిల్చి నిదురపోతున్నవ? సువ్వర్![47] ..." మాలి పటేల్ మాధవరెడ్డి.

"సీ కాలు మొకుత బాంచెన్-నాత్రి నిదురలేదు. కల్లం[48] కాడ కావలున్న-" కొంరడు.

"పంచాతేందిరా?..." కొంరని తోని దొర.

---

46. ఆలోచన. 47. పంది (తిట్టు) 48. కోసినపంట

దొరోరి కుంటక్రింద తను నీరటి ఖితనము సేసిన కాన్నుంచి సివరిదనుక సెప్పు కచ్చిండు కొంరడు.

ఇంతట్లకే మొఖం ఏల్లాడేసుకొని అచ్చిండు- దొరోరి ఇంటి కెల్లిన సుంకరి నర్సిమ్మడు.

"ఏమాయెర నర్సిమ్మా ! దొరేమన్నడు ?..." పోశాలు.

"నీ కాలు మొకుత పటేలా ! గియ్యాల్ల [49] కాపోల్లు, పెర్కోల్లు పంచాతి సెప్పెటోల్లయింర్రా ? అల్లకాడికి సేనురావన్నా అనుకుంట - మీది కురికచ్చింర్రు బాంచెన్ ..." నర్సిమ్మడు అసలు సంగతి తేల్సిండు.

కాసేపు ఎవ్వలు మాట్లాడలేదు

"దొర రాకుంటె ఈడ ఆగేదేమున్నదిగనుక ? నర్సయ్యా ! పోశాలు ! ఈల్ల పంచాతి మనమే తెంపుదాం ..." మాలి పటేల్ మళ్ళో బీడి ముట్టించిండు.

పోశాలు, నర్సయ్యకేగాదు ఆడున్న ఎవ్వలకు దొరోరు లేకుంట పంచాతెట్ల తెగుద్దో సమ్దు [50] గాలె. ఒకరి ముఖా లొకరు సూసుకున్నరు.

"దొర పొలంల దొంగతనము సేయటం కాన్నుంచి దొర బండ్ల నటకాయించడం దాక బొత్తకొంరందే తప్పుగద. ఈల్ల నీరటి బిచ్చెము ఎగబెట్టటాన్కి గుడుక ఈడె కారణంగద - ఏమంటరు పోశాలు ? నర్సయ్యా ? ..." రెడ్డి పెద్ద పెద్దమనుసులిద్దరిని ఇరకాటంలో పెట్టిండు.

"అదిగాద్దొర..." నర్సయ్య ఏదో అడ్డుసెప్ప బోయిండు.

బొత్తకొంరని ముఖంల నెత్తురుసుక్కలేదు.

"ఏదిగాదయ్య ! సాలుసెప్పు ధర్మరాజ అంటె దుడ్డె, బర్రె నాదేనన్నడట ఎనకట ..."

సాలు సెప్పెదెవ్వలో ? దుడ్డె, బర్రె ఎవ్వలదో సమజ్‌గాక నర్సయ్య, పోశాలు బిక్కమొఖం ఏసిన్రు.

ఓదెలు దొరవాలుకం కనిపెట్టి "దొరోరు అనెటిదేందంటె బొత్త కొంరడు, కర్రె లింగడు, తొంటకొంరని కొడుకు లింగడు కలిసి పంచాతి తెంపుకోవాలె. అంతేగాదురి దొరా ?" సాగదీసిండు

49 ఇవ్వాళ 50. అర్థం.

486

"అద్గది ... ఓదెలు నువ్వు సరిగ్గా తెలుకున్నవోయ్" మాలి పటేల్ ఓదెలును మెచ్చుకున్నడు.

"దొరియ్యకుంటె నేనేం జెయ్యాలె బాంచెన్..." భాయిలనుంచి మాట్లా డినట్టు బొంగురుబోయిన గొంతుతోటి అన్నడు కొంరడు.

"ద్దెత్తెరి ... పెద్ద లోకులముంగట నువ్వేం మాట్లాడ్తన్నవు ... ఆల్ల కెరుకలేదా?..." పోశమల్లు దొరకు కోపమత్తదేమోనని కొంరన్ని కసిరిండు.

"లంజకొడుక... నీ పెండ్లాన్ని "—....."నేనేం జెయ్యాలంటన్నవ? సెప్పుబట్టి పండ్లూడగొడుత—నువ్వు జెయ్యంగ కాదుదొర కోపాని కచ్చింది?" మాలిపటేల్ దొరోరినెనుకేసు కొని ఉరమిండు.

కొంరని శరీరం కుతకుత ఉడికింది...

"కోపానికి రాకుర్రిదొర... పంచాతిసేద్దాం..." నరసయ్య నసిగిండు.

సెప్పుమన్నట్లు మాలిపటేలు ఓదెలుకు కన్నుగీటిండు.

"మాదిగలంజకొడుకు లాలా! సెరో యాభై రూపాలు దడావతు[51] పెట్టుర్రి పంచాతి నడుత్తది." అసలు విషయం తేల్చిండు.

"నీ బాంచెన్—సంకటే ఒడితె కార్జముగన్పడ్తది. పెయ్యంత గొడితె పెరుక్కు పెద్దకొత్తెల్లది ముచ్చిలుకలకు [52] యాభై రూపా లెక్కడ తెత్తమ్రి?" తొంటకొంరని కొడుకు లింగడు భయంగ అన్నడు.

"ముచ్చిలుకలు లేంది పంచాతెట్ల నడుత్తది? అయితె మీకు మీరే సేసుకొండి, మజ్జెన మమ్ముల్నెందుకు పిలిస్రిరు?" — మాలిపటేల్ లేచినిల బడ్డడు.

"కూకోర్రి... యాభై అంటే ఈఅగ్గెనగాల్ల [53] మాదిగ లంజకొడుకు లెక్కడదెత్తరు? ఏదో నలుభైకాడికి సేద్దాం" – పోశాలు రాజి కుదురుతున్న ట్టన్నడు.

మాదిగోళ్ళు మాట్లాడే గుండెలులేక కూకున్నరు. ఈ ఊళ్ళె దడావతు లేకుంట పంచాతి జర్గడం ఆళ్ళెగాదు ఆళ్ళ తాత ముత్తాతలు గుడుక సూల్లే.

---

51. పూచీ 52. ఒప్పందం రాసి యిచ్చుటకు 53. ఉన్న పళంగ,

"ఏమంటవుర కొంరా? పోశాలేమొ అంటడు ?" ఓదెలు.

కొంరడు బిర్ర బిగుసుక పోయిండు.

"సరే! కొంరడొప్పుకున్నడు. మీరేమంట్రా ?" ఇద్దరు లింగళ్లతోటి ఓదెలు.

"బాంచెన్ ..." కర్రె లింగడు నసిగిండు.

"బాంచెన్ లేదు ... గీంచెన్‌లేదు ... నగతుదెత్తిరా ? మనుసుల్లొ్నిప్పిచ్చు కుంటర ?" ఓదెలు.

"గొడ్డు బొక్కలు దినే మాదిగోళ్లకు నగతులా ?..." ఆడోల్ల గుంపుల నుంచి కొంరని పెండ్లం మల్లి ఉండబట్టలేక అన్నది.

"లంజెకాన ! నిన్నెవడు పిలిసిండు ? ఈన్నుంచిపో - రాజ్జాలేలుతర ? పంచాతి కాడికచ్చిర్రు..." సర్పంచ్ కోమటి కిట్టయ్య మల్లిని బూతులుతిట్టిండు...

"అవ్వో !... నీ బాంచెనాతే !... రాజ్జాలేలుతమట ! రాజ్జాలు !..." గునిసి సాటుకు జరిగింది.

"ఏంరా కొంర ?" ఓదెలు మల్లడిగిండు.

"పోశయ్య పటేలా ! ఒప్పుకోర్రి బాంచెన్—" కొంరడు దీనంగా మందిల నుంచి పోశాలు కెల్లి సేతులు జోడించిండు.

"నేను మజ్జెన పడనుర-మాదిగిక్కులము మంచిదిగాదు" పోశాలు ఆనికెల్లి సూడకుంటనె సెయి ఊపిండు.

"నీ పెండ్లం పియిదింట - మీరు కాదంటెట్ల? బాంచెన్." కొంరడు బతిమి లాడంగ బతిమిలాడంగ ఆఖరికి ఒప్పుకున్నడు పోశాలు.

లింగలిద్దరి తరఫున నర్సయ్య జమానతు [54] పడ్డడు.

పొద్దు పడమటి కొండల్లకు పోయెదనుక; కంచెల్లకు బోయిన పసురాలు ఊళ్లెకు చేరే దనుక; ఆకులు రాలిన ఏపసెట్టు మీనికి పచ్చులు సేరుకునే దనుక; మర్లేసి, తిర్లేసి, తిట్టి, కసిరి, నాన్సి ఆఖరుకు బొత్త కొంరందితప్పు జేస్రు. కొంరడు తప్పు దండుగు కింద, ఇయ్యేటి సీరటి బిచ్చెము మూడుగిద్దెలు లింగ ల్లిద్దరికి కొలువటమే కాకుంట, నలభై రూపాలు దడావతు కూగ పటేలుకియ్యదేలిండు.

---

54. పూచీ

అంతవరదాక నోట్లె మంచినీల్లన్న బొయ్యని కొంరని కండ్లు బైర్లు కమ్మినయ్... రెండు నిముషాలకు తేరుకుని "పిల్లలు గల్లోన్ని బాంచెన్ దొరా! ఈడికె పూటగడుస్త లేదు. నన్నన్యాయం సేయకండి - బాంచెన్ దొరా!' చెట్టెత్తు మనిషి బోరుబోరున ఏడుసుకుంట మాలి పటేల్ కాల్లకు దూరంగా దుమ్ముల కూలబడి పోయిండు.

మాలి పటేల్ పోశాలు దగ్గర నలుభై రూపాలు తీస్కోని ఆని మొఖమన్న సూడకుంట ఇంటికెల్లి నడిసిండు.

"కొంరా ... ఐతార[55] మొచ్చెటాల్లకు నలుభై రూపాలు పట్టుకరా!" పోశాలు ఎల్లిండు

ఎవరితొవ్వల వాల్లే ఎల్లిపోయిండ్రు ... కొంరనికి లేవడానికి శక్తి సాలలే దుమ్ములకూకుండి పోయిండు ... గొడ్లు, బర్రు బజారులో దుమ్ము లేపుకుంట ఎల్లిపోయినయ్. వాని శలీరమంత దుమ్ము నిండింది... వాని బతుకులగుడుక దుమ్ము నిండింది.....

సందె చీకట్లు పడుతున్నయ్– చిమ్మెట్లు పలుకుతున్నయ్ ... కొట్టాలల్లకు సేరుకున్న పసురాలు దుడ్డెల్ను, లేగల్ను సూసుకొని మురిసిపోతు ఒర్లుతున్నయ్.. ..

మెల్లగ లేచి నిలబడ్డడు.... మూడుపానాదులను ఒక్కసారి కలెసూసిండు... ఈన్నే అళ్ళంత కూకుంది తనబతుకుల సీకటి నింపిర్రు ..... చీకట్లో బూలచ్చిమి సెక్కబొమ్మలు .... సీకటి .... ఔను సీకటి–మొత్తం ఊళ్ళంత సీకటే...

"అవ్వా–మావ్వా ... బువ్వేయిర్రి" ... ఎవ్వలింట్లనో పోరగాడు అరుత్తండు నోరుసించుకొని ...

"అని బతుకేకచుం ..." మల్ల కలెజూసిండు: "ఈ వాడ శొంట[56] బోతె పెరుకోల్లవాడ. ఈ వాడ కాపోల్లది మరి ఈవాడో ... కుమ్మర్లు, కమ్మర్లు, అడ్లోల్ల[57] మొత్తం ఇండ్లన్ని పనోల్లయె. ఇంకకిందికి బోతె నరకం గవులు[58] కొట్టె మురిగిపోయిన మాంసము, పైన ఎగురుతున్న పీతిరి గద్దలు...బొక్కలు కుక్కలు... ఛీ—ఛీ ... ఇట్ల. ఇప్పుడు ఇంటికిబోతె పోరగండ్లకు, మల్లికి

55. అదివారం 56. వెంట 57. వడ్రంగులు 58. కంపు

ఏ మొఖం సూయించాలె? అయితె ఎటుపోవాలె ... సర్పంచ్ కిష్టయ్య.

"మెరుపసొంటి ఆలోచన... తనొక్కోటు తక్కువుండె—కాదు—కాదు, తన ఓటుతోటె గెలుసిండుగద— ఈ కష్టకాలముల ఆదుకోడ? తప్పకుంట ఆదు కుంటడుగని'— కాళ్ళీడుసుకుంట కాపోల్ల వాడకెల్లి నడిసిండు.

గిదే—ఇదే పోశాలిల్లు...., ముంగట పెద్దరువాజ సుట్టు పడారి[59]గోడ— లోపట సెన్నపెట్టికట్టిన నాలుగిండ్లు — ఈ ఇండ్లకు సున్నం డంగు కొట్టి సేతులు కాయలుగాసి పోయినయ్ — సేతులకెల్లి సూసుకున్నడు.... సేతులుకాయలు గాసి మోటువారి పోయినయ్. సున్నం డబ్బ మోత్తే నెత్తిమీని ఎంటికలు ఊసిపోయినయ్. నెత్తిపుసికిసూసుకున్నడు – నున్నగ తగిలింది ... ఉపాస ముండి, ఉప్పిడుండి బండలు మోసి ఇండ్లు కట్టినమ్ ... సివరకు నంభైరూపా లొప్పుకోలే —

నన్ను పాలేరుంచుకొని నాలుగేండ్ల దనుక ఫెట్టుబడి పెట్టలే – సిన్నకుండ పెట్టి తాలు తప్ప గొలుసిండు ... అంతా తోడుదొంగలు. సెప్పకుంటె ఇనెటోల్లెవ్వలు ? ... గన్ని పనులుచేత్తే బొర్రోడు ... పోసిగాడు అయిటారం పైసలు గట్టుమన్నడు ... కుక్కలు నయం మాడిసెక్కటొక్కటేత్తే అజల్మాం తము[60] మరిసిపోదు ... ఈడు మాదిగోడైతెనా ? లంజకొడుకును బొత్తవలుగ్గొట్టి జేలుకు బోదును. అర్నెల్లంటే ... పెద్ద లోకులు ఏంజేసిన సెల్లుతది ... రాజ్జం అళ్ళదేమరి !

పోశాలిల్లు దాటిండు... ఓదెలిల్లు అచ్చింది. గీడు-గీ బట్టెబాజి[61] ఓది గాడు .... తినబోతె తిండికిలేని గీ లంజకొడుకు దొరోరి మోసెయికింది నీల్లుతాగే గీ బద్దుమాసి....దొరోరిమాటలకు తాళాలుకొట్టిండు ఈనికి నేనేం పాపం జేసిన? ఈని బిడ్డను మారుమానపు[62] మొగడు ఇగ్గుకపోతంటె అడ్డందిరిగి సమ్జాయించి కాపురం నిలబెట్టిన్నే!.... అందుకనే ఈని గుడిసెపందులు గుడిసెను మించి పోత లేదు. తాడెక్కటో డొకడుంటె తలతన్నెటో డొకడుండడు మరి !....

---

59. పడారి (ప్రహరీ) 60. బతికినంతకాలం, (62. తిట్టుమాట,)
62. మారుమనువు

ఆడుతని నెత్తి బుడుతడు కొడితె బుడతని నెత్తి బోడోడు గొట్టిండంట! దొర అనకముందే ఈడు ఎగిరెగిరి జుట్టు పిట్ట వగుతుగ .... పిడికిల్లు బిగుసుకున్నయ్.

ఓదెలిల్లు దాటిండు ...లసుమయ్య ఇల్లు అచ్చింది ... గీ చింగెం లసుమయ్య పెండ్లం దావఖాం[63] డ్లుంటె ... నాత్రి పగలు ఆనికి తోడుగా ఉండి ఏది గావా లంటె అది సేసిపెడ్తినే! ఒక్కమాట ... "ఆనిది తప్పుగాదని" - అంటె-ఈని ముల్లె మునిగి పోయిందా? ఛత్ ! బంచెత్! లంగలోకం!... బట్టె మాజి మనుసులు!

ఇంతట్ల సందుల దీపాలెలిగినయ్... సీకట్ల నడుత్తున్న కొంరని కండ్లకు ఒక్కసారిగ ఎలుగు కన్పించేటాల్లకు కండ్లు కన్పడలే... గీ సర్పంచి కిట్టడు, నర్సడు, పోసిగాడు బట్టెబాజులంతా - ఏదో ఒరుగ పెడ్తదని కంబాలు[64] లేవట్ట నుకు, పొక్కలు తోడనుకు తీగెలిగ్గెటందుకు పుక్కానికి[65] తీస్కపోయిన్రు.... ఆకలితో పైన పోయిసమ్.... సవ్వల్లమీన[66] దీని తస్సదియ్య పుర సెయిమట్ట మీన కంబముబడి అయిదురోజులు వాత్తె నాపోరగండ్లు ఉపాసమున్నరు బాయి లకాడ ఇంజన్లు పెట్టుకున్నరు – ఇంటిముంగిల తలోటిబుగ్గలు[67] పెట్టిచ్చు కున్నరు.... ఇండ్లల్లకు తీసుకున్నరు.... కోమటోడు పెండ్లాం, పోరగండ్లు ఏరగ బోతరని, అగుకెల్లి సేన్ల మందిలేనికాడ, ఇండ్లులేనికాడ బుగ్గపెట్టిచ్చిండు! పెద్దమ్మ గుడికాడోటి, గూడెంలోటి పెట్టాల్నని ఎంతమొత్తుకున్నా?.... ఆడెవడో ముక్కెమంతిరచ్చిండంటే కూడుదినకుంట సర్పంచ్‌గాడు తీసుపోతే .... రోడ్లే పిచ్చినన్నడు!.... అయ్యెవ్వనికి కూడు పెట్టినయ్ ? ఆళ్లేరానుపోను మోటార్లల్ల తిరిగెటాన్కి బనికత్తన్నయి....ఎక్కన్నో ఆడివిలబిర్జి[65] కట్టించిండట!.... ఏంజేసు కోను బిర్జి ? ఇంకేందేందో సేసిండట.... ఎక్కడ కన్పించలే! కరెంటచ్చిం దని ఆడు సెప్పితే మతికచ్చి కోటక్కపజలో నేనొక్కన్ని నిలుసుండి అడుగుతె అందరు సవ్వంగ ఆడునవ్వి ఏయిత్తనన్నడు.... అఖరికత్తె పెద్దమ్మ గుడికాడ ఒక్కకంబమేసి దానికి బుగ్గ బెడితె రొండ్రోజులెలిగి తప్పమని ఉడాయించింది....

ఈల్లు సేసెడిదంత నాయమంట! నేను సేసింది అన్నాయంఅట! ఔను మరి ! బిచ్చాలెగ బెట్టుడు, సాకల్దాన్ని గుంజుడు సీ సీ, అయ్యన్నినాయం!.... నేను సేసింది అన్నాయం!

---

63. ఆసుపత్రి 64. స్తంభాలు 65. పుణ్యానికి 66. చవుడు నేలలపై 68. బల్బులు 69. బ్రిడ్జి,

నేనేంజేసిన? యాడాదిపొడుగూత ఉపాసముప్పిడుండి అని పొలాన్ని కంటికి రెప్పోలె కాపుకాత్తె- దొరగాడు అడ్లగింజలు పొలం గోసినంక ఇత్తనంటె- అంతదాక ఎట్ల బతుకాలె? అడిగడిగి నోరునొచ్చె- పోరగండ్లు ఆకటికి మాడిసచ్చె కాలమచ్చె.

ఆనాడు సిన్నోడు.... నా పానం [69] నా సిన్నకొడుకు మల్లిగాడు జెరమొచ్చి 'అయ్య ఆకలి' అని ఆ సిన్న సేతులతోటి ఈడుసుక పోతన్న కడుపు సూపిత్తె తనపానం సుమ్మర్ల సుట్టుక పోయి- అని పొలంల అదీ ఆరుగాలము కట్టము జేసి పెంచిన పొలంల ఇంత మెద [70] పాలేరు సూడంగ దెచ్చుకొని నలుసుకొని గంజి గాసు కొనుడు దొంగతనమా ?

అమాట కత్తె నాసింత మీని సింతకాయ- ఇంటికాడెవ్వలు లేకుంట సూసి పాలేర్లతోని ఇత్తుకు లేకుంట తెంపుక పోవుటం దొరతనమా ?

ఆడంటె అట్ల నా కడుపు మీన కొట్టిండనుకుంటె-ఈడు ఈమాలి పటేలోడు- ఏందేందో ఆదిరి [71] ఆఖరి కత్తె నా దగ్గెర తప్పు దండుగ తీసుకుంటడ ?

నాయం .... నాయం .... నాయం తల్దెం— ఖరాఖండి మాట్లాడ్తె కట్టి బోతనిరి .... మాదిగిలంజకొడుకులంత ఆళ్ళు తన్నినా పెండ్లాలనిగ్గినా- ఆళ్ళ దిక్కే పలుకుతురు— సివరకత్తె అగ్గి, నీల్లు బందు జేత్తరు .... ఈల్లంత పుండు మీని ఈపులు కాకుంటె పురుగులు .......

సర్పంచ్ కిట్టయ్య ఇల్లు దాటి పోయిండు. కొంరడు ఇచారించుకుంట .... జల్ది గుర్తొచ్చి ఎనక్కు తిరిగిండు.

కిట్టయ్య పెద్దరువాజ ముంగట నిలుసుండి "పటేలా .... ఓ పటేలా ...." గట్టిగా పిలిసిండు.

"ఎవ్వర్రా ఏల్ల - పాల్ల లేకుంట ...." లోపలికెల్లి సర్పంచ్‌ను సాదుకున్న తల్లి బయట కచ్చింది....

---

69. ప్రాణం 70. ధాన్యపు కట్ట 71. అరచి

492

"నేనవ్వా బాంచెన్ ...." కొంరడు ఇప్పటి ఆలోచనలన్నీ మరిసిపోయి నసిగిండు మల్ల పాత కొంరని తీర్గ.

"ఏందిర ? కుక్కలకొడుక ! ... పచేలుకేం దెచ్చినవ్ ఇంత నాత్రి ?" ముఖం పేలాల పెంకోలె మాడుసుకొని కసిరింది ...

'ఔనే ... గరీబోన్ని ఏంతెత్త ? .... తెచ్చిచ్చి, తెచ్చిచ్చి, సిప్పచేతి కచ్చింది .... నీ మొగడు పచ్చవాతంల పడితె ఆని మంచముఖ్రె మట్టుకాడేత్తె అని పియ్యి, ఉచ్చ ఎత్తిపోసేటప్పుడు ఏంపట్టుకచ్చిన ?' ....కొంరని మనుసుల పుసుగు తొలుత్తంది.

"సిన్న పని బాంచెన్ ...." పాతకొంరడు.

బూతుమాటలు తిట్టుకుంట లోపలికి పోయింది.

కాసంత సేపటికి బుర్రపంచె మీదేసుకొని జంజరం తీడుకుంట అచ్చిండు కిట్టయ్య ....

'బొర్ర పెరిగింది .... ఊగుతంది .... పెరుగదిమరి ! రూపాయి తీస్కొని నాలుగు మిరపకాయలు, పిరికెడు ఉప్పు, చెవులేసుకునేటంత నూనెపోసి మిగిలిందంత తిని బొర్ర పెరిగింది ....' కొత్త కొంరడు ఒకచేలొల్లి పెడుతండు.

"ఏందిరా కొంర ?.... అద్దుమనాత్రి ! ...." కనుబొమ్మలు ముడిసి కసిరిండు కిట్టయ్య.

"ఏంలేదు బాంచెన్ .... గ నలుబై రూపాలు ...." కొంరని గుండెలకెల్లి మిగతా మాటలు బయటపడలే.

"రూపాలెక్కడున్నయిరా? అయ్యవ్వదాస[72] పెట్టిన్రా. ఏయేల్లబడితె ఆ ఏల్ల బదలిచ్చేటాన్కి ?" కిట్టయ్య ఎనక్కు తిరిగిండు.

---

72. దాచి

"నీ బాంచేన్ .... గట్లంటెట్ల ? .... మీరియ్యకుంటె ఎవ్వలి త్తరు ? ముంగటికి నీ బాంచెన్ .... కాటికి కావలుండైన, నీ కాళ్ళకాడ బతికైన అడ్డీ[73] తో నీ రూపాలు పూలల్లబెట్టి ఇత్త బాంచెను" నాలుగుసార్లు గడుపకు మొక్కిండు.

"ఏంజూసయ్యాలె ? .... అదె ఆవో, లేగో అమ్మరాదు ?....అంతలావయితె..." కిట్టయ్యకు కొంరని బుల్లావుమీన కన్నుపడ్డది .... ఓట్లప్పుడు అనవుసరంగ దానికోసం కచ్చెడు గడ్డి ఇయ్యాలిసచ్చింది.

కొంరని గుండెల్ల బల్లెం గుచ్చినట్టయింది.... మాట గుడుక పెకల్లే "అయి తారము తెచ్చియి" పోశాలు హెచ్చరిక. మూడుగిద్దెల అడ్లు లింగలిద్దరికి కొలువాలె.... మల్లిఊకుంటదా ? తనమామ మల్లితోడుత అర్న[74] మిత్తె అమ్మంగ, అమ్మంగ మిగిలిన ఆవు. ఆకలయి ఏడిసే పోరగండ్లకు గుక్కెడు పాలిచ్చే ఆవు.... కొంరని మనసు సుమ్మర్లు సుట్టుకపోతంది....

కిట్టయ్య లోపలకు పోతండు.... కొంరనికేం సేయల్నొ తెలువలె ... మీన సందిల దీపం ఎలుగుతంది.... తనసేతుల మీన పెరిగిన కోల్లాగెల, తవ్వెడు' తవ్వెడు పాలిచ్చె గొడ్లను ఊనికె ఇచ్చిన. అయిన ఊనికి కడుపునిండలే— ఉన్నొక్కకోంద్ర గుడుక ఊని కొమ్ముమన్నే పెట్టిన....

కోంద్రంటె మతికచ్చింది... చెవులఉన్న సగంకాలిన సుట్టమొక్క తీసు కున్నడు. జెకమొక కొట్టుకొని సుట్ట అంటించుకొని గుప్పు గుప్పున రెండు దమ్ములిగ్గిండు.... ఆడు ఇంటి ఇసియం, గొడ్డు ఇసియం మరిసిపోయిండు.

"ఔను, గుడిమెట్టు బాడువపొంట.... లైను గొట్టినకాడ సెలుకుండె.... గడ్డలంపులు సమానం సేత్తె — అది పరంపోగే[75] నాయె, నీ యక్క ! ఆ యింత కొమ్మగొట్ట గొట్టుకుని కట్టబడితె.... ఇంత బాయిపొక్కతోడ్కుంటె.... అరేడెకరాలు పెరడైతది. నీ యవ్వ! దీని తల్దెం.... ! ఈ దొరోల్ల జీలి గీలి ఏముంటది".

సందుల దీపం రెండుమాట్లు కొట్టుకొని తప్పుమన్నది.

73. వడ్డీ. 74. కట్నం. 75. పోరంబోకు.

కిట్టయ్య తిని బయటికెల్లి, కంబము మొదట్ల అగ్గిని సూసి —

"ఎవ్రా? ..." గద్దరాయించిండు.

"బాంచెన్–కొంరన్ని..." లేసి కిట్టయ్యముంగటి కచ్చిండు–సుట్ట మలిపి చెవుసందుల పెట్టుకొని.

"ఇంకీడ ఏంజేత్తన్నవ్రా ?" కిట్టయ్య.

"ఇసారించుకుంటున్న – బాంచెన్, గొడ్డును లేగనెంతకు దీసుకుంటరు ? బాంచెన్...." కొంరడు.

"ఏమియ్యల్రా ? గొడ్డు మూడీతలది. ఏంబెట్టినా లేగకే ...."

'కోమటోని బేరం ఉప్పో, పప్పో ఇత్తడు కావచ్చు' మనుసుల కొంరడు. పైకి - "గొడ్డు ముసల్దా ? బాంచెన్ - మీరు సూత్తినే సూత్తిరి, మూడరుసోల్ల పాలిత్తది. మీదగ్గరనైతే తవ్వెన్నరు సోడిత్తది. అడుగరాదుర్రి బాంచెన్ ...."

"మూడుగిద్దెల అడ్లు - నలభై రూపాలు గిత్తయాసు[76] ర?.... నువ్వె సెప్పు .... ?" కిట్టయ్య ....

కొంరనికి శలీరం మండింది....ఏంజేత్తడు ? "గాయింతేస? బాంచెన్ .... అరేడు నూర్లు పెత్తరు కోల్లాగెకె ఇంక రెండేండ్లకు."

మరో ముప్పయిత్త నీ యిట్టము .... కిట్టయ్య ఎనుకకు తిరిగిండు లోపలకు పోయెటాన్కి.

'మల్లి .... పోరగండ్లు .... నలుబై రూపాలు - మూడుగిద్దెల అడ్లు .... తన పానం అవు' .... తోడుదొంగలు ఇంతకన్న ఎవ్వడెక్కువియ్యడు.

"సరె బాంచెన్ .... పొద్దుగాలొత్త .... "కొంరడు.

---

76. గిట్టుబాటు అవుతయా ? 77. ఖచ్చితమేనా ?

మాట పక్కేన ? .... కిట్టయ్య హెచ్చరించి లోపలకు నడిసిండు.

కొంరడు గూడెంకెల్లి నడిసిండు

సీ, సీ .... ఎక్కువోల్లంత లంగలు ! నాయంలేదు ! అమిడికొడుకులు, నేనేమొ రెక్కలు, బొక్కలు, కళకళమనంగ కట్టబడాలె ! ఆళ్ళేమొ మనమీన సవారు సేయాలే ! యాడున్నది నాయం ?

ఏందోగని ఈదేవునికి గుడుక నాయం తెలువసట్టున్నదెహెం ! కాకపోతె - మందిని ముంచెటోల్లకె - మేలుసేత్తడు. ఈడుగుడుక లంచాలోడే ఉన్నట్టున్నది !

అన్నట్టు సర్పంచ్ గానితోటి మంథెన్లకు పోతె ఆడెవ్వడో ఆనాడునాత్రి సబ సెప్పి దేవుడు లేడన్నడు. అని మాట నిచ్చమే [78] ననిపిత్తంది. ఆనికేమెరుక ? సోరోడనుకున్న-నిచ్చంగ దేవుడుంటే ఎందుకు సూత్తలేడెహెం? గింత అన్నాయం జరుగంగ ఆడు కల్లు మండుపకాడ కడుపుబ్బ తాగినోన్కి పపంచము బట్టనట్టెందు కూకుంటడు. నల్లగొండ సాత్తుర్లు కిట్టావతారం సెప్పినప్పుడు ఎప్పుడు వడితె అప్పుడు అచ్చి పాండవుల ఆదుకున్నడె.... మాల్లె కిట్టడు పాండవులకత సెప్పిండు దర్మరాజుకు గిట్లనే కట్టాలు తప్పలే- కిట్టమూరితి అచ్చిండు. మరి ఈదేడి ?....

పోశమ్మకు గొలిసేటప్పుడు ఘటమెత్తుకొని ,'బలో బల ,' ని లెల్లాయిపాట పాడుకుంట పోతంటె పంబాల దుర్గన్న "శగితి ఆగ బట్టిందిరా" అని కేకపెట్టి కోడి పిల్ల లెగిరేయాలె అన్నడు ఉత్త దెందుకయిద్ది ? దెహెం! అని తపాసె మల్లె మొఖా నికి మంత్రాలత్తయ- అని ఎద్దు కడుపుబ్బి పెటేల్న సచ్చింది. ఏలుపమ్మ పట్టిం దని ఆదే అన్నడు. జువ్వి కిందకొత్తె కారుమబ్బు లేసి సచ్చిందని తెలిసింది.

అంత అట్టిదె ! దేవుడు లేడు-దయ్యం లేదు. బయపెట్ట టాన్కెగని....

పల్లె దాటిండు.... పిల్లగాలి మురుగు వాసన మోసుక పోతంది. కొంరనికి సీకట్ల మాదిగోల్ల గుడిసెలు దయ్యాల వవుతుగ అగుపించినయ్. పల్లెకెల్లి సూసిండు సందు దీపాలు ఎలుగుతున్నయి. మాదిగి గుడిసెల సూత్తె రోతపుట్టింది. కొంరనికి-

78. నిజమే

మాదిగిగూడెం అవుతల నక్కలు కూ_త్తిన్నయి. జువ్వి సెట్టుకింద కుక్క ఒక్కతే కూకొని ఏడుత్తంది.

ఆరుగాలము కట్టబడ్డ మాదిగగూడెం పల్లె వవతుగ కాక పోవటాన్కి కారణంయేందో కొంరనికి తెలువలె.... అదే పల్లెల కొంతమంది పెద్దోల్లయి ఇంకొంతమంది కూటికి లేనోల్లయిందెందుకో ? అడు గుర్తుసేసుకోలె.... పెంట కుప్పలు, ఇరుకుసందుల గుండనడిసి గవులుగొడ్తన్న గూడెంల నుంచి ఇల్లు సేరుకున్నడు.

పందిరి కిందనుంచి గుడిసెలోపలకు పోతంటె ఆరేసిన మాంసపు నారలు నెత్తికి తగిలినయ్.... సీ! సీ!

గుడిసెలోపట దీపం సమురులేక మలిగిపోవటాన్కి తయారయింది. తొడమీన సంటిదాన్ని పండబెట్టుకొని ఏడుసుకుంట గలుమకెల్లి సూత్తంది మల్లి ....

అంగకుంటనె గుడిసెలకు సొచ్చిండు. "నాసలుకు అసం[79] తగిలింది. "అన్నన్నాయి..." తడుముకుంట లోపలికి నడిసిండు.

"అచ్చినావ్రా ? నీ కాడుగాల, పోరగండ్లనోట్లె మన్నుకొట్టి..." మల్లి ఏందేందో తిడుతంది.

"నేనేం జెయ్యాల్నె?" కొరండు సేతగానితనాన్ని ఎల్లబెట్టిండు, కూలబడుకుంట.

"ఆలింద్లుకాల, కూల, కాముని పెంటగాను, నాపోరగాండ్ల కాడి నోటి బుక్క దీసుకున్నోని నోటికాడి బుక్కదేవుడు దీసుకుంటడు. ఆని సేతులకు నరుప్పులు బుట్ట, జెట్టలుబుట్ట, బోదగుండు సౌదరోని మొల్తాడు దెంప- ఆని పిట్టకు బెట్ట- అప్పటికప్పుడు జీతమెగబెట్టిండు, ఇప్పటికిప్పుడు దండుగ బెట్టిచ్చిండు. మాలిపటే లోని ఉన్నాక బిడ్డ ముండమోత్తది- నీకేం పాపం జేసినంరో దేవుడ !.... నీ గుల్లె రాయి బడన్రోదేవుడా !" ఎటుసాతగాక ఏడుపు మొదలుపెట్టింది.

79. వాసం

"అయ్యో !.... అయ్యో ! నువ్వు రాంగ జొండ్లు దెత్తినన్నవ- గడుకెప్పు డిసురుతం ?.... బువ్వ.... ఓ అవ్వ ! బువ్వే.... హాఁహాయ్యి.... మర్రెహోహో.... సుక్క దాన్ని గొయ్య! ఆకలై సాతనై తలేదంటె ఉరుకుతంది...." రాజిగాడు నిదురల కలువరిత్తండు....

కొంరని మనుసు ఎట్లనే వున్నది. అనికి గుడుక ఆకలైతంది. ఆకలికి సిన్న పెద్ద బేదం లేదు గద ?.... ఇగ పోరగాండ్లదో లెఖ్ఖ !...

రాజిగాని పక్కకు ఒరిగిండు కొంరడు....

కడుపుల కరకర లాడ్తన్న ఆకలి ! కాళ్లు కడుపుదాక ముడుసుకున్నడు. అయిన అకలి తగ్గలే—

గుడిసె బయట లేగ ఒర్రింది. అవు దాన్ని పిలిసింది.

"లేగ నువ్వు పసురానివైన నీఅదురుట్టం బాగున్నది.... ఏం బతుకులో ముది నట్టపు బతుకులు !.... సచ్చింది మేలు.... మనుసులము —" సగంల ఆపిండు కొంరడు.

మల్లి ఏడుపు మగ్గి ఎక్కిల్లకు దిగింది.... బయట లేగపొలు చీకుతంది...

జువ్వికింద అకలై కుక్క ఏడుత్తంది.

## 3

తెల్లారి పోయింది..... పల్లె తెల్లారకముందె లేసి బతుకు తెరువు కోసరము పారలు, గొడ్డల్లు, కొడువల్లుఁ నాగండ్లు పట్టుకొని పొలాలల్లకు సేన్లల్లకు ఎటుబోయె టోల్లటు పోయిర్రు.... తూరుపు కెల్లినుంచి సూరీడు కత్తులు, కటారులు, బాణాలు ఇసురుతున్నడు.

బొత్త కొంరడు ఎటో పోయచ్చి తలకున్న గుడ్డను దులిపి మొఖం తుడుసుకున్నడు.

మల్లి గుడిసె బయటకచ్చి దుబ్బకొట్టుక పోయిన ఎంటికలల్ల రెండు సేతు లుంచి కాసేపు గోక్కున్నది. అటెనక సిక్కులు దీసి ముడిపెట్టటాన్కి పయత్నం సేసింది. కాని ఆల్ల బతుకుల తీరుగనె ఎంటికలు అనుగలే.

"అయ్యో ! గొడ్డు నిడువే కొట్టుకపోత...." రాజిగాడు కొంరని ఎనుక లేగ తలుగ, సేతుల్ల పట్టుకొని సిన్నకట్టె సంకల పెట్టుకొని నిలబడ్డడు.

"ఇంక గొడ్డెక్కడ్దిర? గొడ్డుకు మనకు బాకి సెల్లిపోయింది!" గొడ్డుకెల్లిసూత్తె వాని గుండె తరుక్కుపోతంది.

రాజిగాని కామాట సమజ్‌గాలె....

ఇంతట్లకె కిట్టయ్య పాలేరు మల్లేశ దచ్చిండు.

"కిట్టయ్య పటేలు గొడ్డును తెమ్మన్నడు." మల్లేశడు.

"ఏందేంది?...." మల్లి ఎంటికలల్ల సేతులుంచి ఆవుదగ్గరి కచ్చింది అదిరిపోయి.

"మన గొడ్డు నమ్మిన్నే...." కొంరని గొంతు తట్టుకున్నది.

"నీ సేతులు పడిపోను గదరో ! మా అయ్య సంపతి ఈ ఒక్క గొడ్డును గుడుక అమ్మినావురో ? నీ దినాల కరుసు[80] కనుకున్నావురో ? నా పోరగండ్ల గతేంగానురో దేవుడాఁ !" సిన్నగ రాగం తీసింది.

కొంరడు గొడ్డుకాడికెల్లి దాని మూతిమీన సెయ్యేసిండు ఎన్నడులేంది గొడు మట్టుకాన్నె పెనుగులాడింది, బెదిరి బెదిరి సూసుకుంట.... దానికికూడ ఎరుకైందేమొ ?

"నాగొడ్డు...." రాజిగాడు లేగ తలుగిడిసిపెట్టి గొడ్డు దగ్గరి కురికిండు.

కొంరడు గొడ్డును నుచ్చుకొట్టి దాని మెడకు తలుగు తగిలించి దాని తలకాయమీన మొఖంపెటి కన్నీలు కారిసిండు.... "నీకు నాకు రుడం[81]" తీరిందె.... గొంతికనిండ ఏడుపు నిండుకపొయ్యి మాట పెకల్లే ....

80. అంత్యక్రియల ఖర్చు 81. రుణం.

మల్లేశడు తలుగు కొసకు పట్టుకున్నడు. గొడ్డు సిర్రు బుర్రు లాడింది. మల్లి బూతులు తిట్టుకుంట బొటబొట ఏడుసుకుంట గొడ్డును పెయ్యంత ముట్టు కొన్నది....

రాజిగాడు ఏడుసుకుంట దాని కాల్లముంగటిక్కి పొయ్యి "నీ కాలు మొకుత మల్లేశన్న .... నన్ను తొక్కిచ్చుకుంట - నా మీనికెల్లి తీస్కపో.... నా ఆవులేగ పోయినంక నేను బతికెందుకు...." అడ్డం పండుకున్నడు.

"గిసొంటోల్లు ఎందు కమ్మిర్రు ?" మల్లేశడు గునిసిండు.

మల్లి రాజిగాన్ని జబ్బ పట్కొని గుడిసెల కీడ్సుకపోయింది ఏడుసుకుంట....

కొంరడు మారుమాట్లాడకుంట అక్కెల్లి నడిసిండు. జువ్వి సెట్టుకింద కుక్కలు మురిగిపోయిన గొడ్డును పీక్కతింటన్నయి. మీన పీతిరిగద్దలు, బొల్లి గద్దలు తిర్గుతన్నయి.... మల్లి సాపిచ్చుకుంట ఏడ్సుడు ఆనికి కాసంత, కాసంత దూరమైతంది....

ఎనక్కు దిర్గి సూసిండు.

మల్లేశడు దడిపొరుక పీకి గొడ్డు ఈపుమీన జాడిచ్చి కొట్టిండు.... ఇన్నేండ్లుగ కొంరడు కొట్టని గొడ్డు- గావురంగా దిరిగిన గొడ్డు- సడ్డిరిసి ముంగటికి సాగింది. దానెనుక లేగ ఒర్లుకుంట ఉరుకుతంది....

కొంరని కండ్లల్లనుంచి- ఇముడలేని నీల్లు రెండు సుక్కలు నేలమీన పడి ఇనికిపోయినయ్....

( ముగింపు - వచ్చే సంచికలో )

---

## రచయితలకు మనవి

ప్రజా జీవితాన్ని, పోరాట చైతన్యాన్ని ప్రతిబింబించే కథలు కావాలి. సృజనాత్మకమైన, కళాత్మకమైన కథలు పంపించి 'సృజన'తో సహకరించాల్సిందిగా కథకులను కోరుతున్నాం.

— సంపాదకుడు.

500

---